

పదిలో బాలికల హవా

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి లాగే పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నంద్యాల జిల్లా 17వ స్థానంతో సరిపెట్టుకుంది. అయితే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో కూడా మెరుగైన ఫలితాలు వచ్చాయి. జిల్లాలో 24,496 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా అందులో 20,051 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులై 81.85 శాతం సాధించారు. అందులో 12,702 మంది బాలురు పరీక్షలు రాయగా 10,097 మంది ఉత్తీర్ణులై 79.49 శాతం ఫలితాలను సాధించారు. 11,794 మంది బాలికలు పరీక్షలు రాయగా 9,954 మంది ఉత్తీర్ణులై 84.40 శాతం ఫలితాన్ని సాధించారు. దీంతో బాలికలదే హవా కొనసాగింది. గత ఏడాది 85.62 శాతం ఉత్తీర్ణతతో 19వ స్థానంలో ఉన్న జిల్లా నేడు 81.85 ఉత్తీర్ణతతో 17వ స్థానానికి చేరుకుంది. కానీ ఉత్తీర్ణతా శాతంలో గత ఏడాది కంటే తగ్గడం గమనార్హం.

- 81.85 శాతం ఫలితాలతో 17వ స్థానంలో నంద్యాల జిల్లా
- బాలికల ఉత్తీర్ణత 84.40 శాతం, బాలురు 79.40 శాతం
- ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- గతేడాదికన్నా తగ్గిన పాస్ పర్సంటేజీ


దీక్షితారెడ్డి 596


సాయిసంతోష్ 596


యశస్విని 591


సుమంత్ 591


సాదానాగేంద్ర 592


హైమావతి 589


పూజిత 588


పబ్బతి సాగర్ 587

● మెరిసిన 'ప్రభుత్వ' విద్యార్థులు

నంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారు. బండిఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న సుమంత్ 591 మార్కులతో టాపర్‌గా నిలిచారు. అలాగే బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న కావేరి 580 మార్కులు సాధించారు. రుద్రవరం మండలం ఎల్లావత్తుల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సాదా నాగేంద్రబాబు 592 మార్కులు సాధించాడు. నంద్యాల మండలం చాబోలు జడ్పీ పాఠశాలకు చెందిన పబ్బతి సాగర్ 587 మార్కులు సాధించాడు. బండిఆత్మకూరు యర్రగుంట్ల జడ్పీ పాఠశాలకు చెందిన శ్రుతి 584 మార్కులు సాధించింది.

నంద్యాల శ్రీలక్ష్మీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన షేక్ ఇఫ్రత్ 600 మార్కులకు గాను 599 మార్కులు సాధించి రాష్ట్రంలోనే 2వస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇఫ్రత్ తండ్రి డాక్టర్ షేక్ మహ్మద్‌రఫి, తల్లి ఫిర్దోస్‌భానులది నందికొట్కూరు పట్టణం కాగా పిల్లల చదువుకోసం ఆరేళ్ల క్రితం నంద్యాలకు చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు ఇఫ్రత్ శ్రీ లక్ష్మీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోనే చదువుతున్నారు. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు ఇఫ్రత్ ఎంతో చురుగ్గా ఉంటూ అన్నితరగతుల్లో టాపర్‌గా రాణిస్తుండేదని, పది పరీక్షలో ఇంతస్థాయిలో మార్కులు సాధిస్తుందని ఊహించలేదని అటు తల్లి దండ్రులతో పాటు పాఠశాల యాజమాన్యం లక్ష్మీరెడ్డి, శ్రీలక్ష్మిలు పేర్కొన్నారు. ఎంతో పట్టుదల, ఏకాగ్రత ఉన్న శ్రీలక్ష్మీని ఎప్పుడూ ఒత్తిడికి గురి చేయలేదని, తరగతి గదిలో తప్ప ఇంటికి రాగానే పుస్తకాల జోలికి వెళ్లలేదని, ఒక్క పరీక్షా సమయంలో మాత్రమే ఇంట్లో చదివిందని తల్లి ఫిర్దోస్ భాను తెలిపారు.

తగ్గిన ఉత్తీర్ణత శాతం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమ ఫలితాలను సాధించాయి. ఉత్తీర్ణత శాతంలో 11 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. గోకవరం జడ్పీఉన్నత పాఠశాల, పాములపాడు ఏపీ మోడల్ స్కూల్, పెద్దకొట్టాల సెయింట్ జోసఫ్ స్కూల్, కేజీబీవీ రుద్రవరం, కొత్తపల్లె జడ్పీ పాఠశాల, అమ్మిరెడ్డినగర్ కేజీబీవీ స్కూల్, కోవెలకుంట్ల సెయింట్ జోసఫ్ స్కూల్, శ్రీశైలం బీసీ వెల్ఫేర్ స్కూల్, నెరవాడ బీసీ వెల్ఫేర్ స్కూల్, ఆళ్లగడ్డ సోషల్ వెల్ఫేర్ స్కూల్, ఆళ్లగడ్డ బీసీ వెల్ఫేర్ స్కూల్స్ వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

● గత ఏడాదితో పోలిస్తే..

పాఠశాల	- పాఠశాలలు	- 2024 (శాతం)	- 2025 (శాతం)
ఎయిడెడ్	16	72.10	67.36
బీసీ వెల్ఫేర్	06	99.00	94.84
ప్రభుత్వపాఠశాలలు	12	67.90	60.71
ప్రభుత్వ ఆశ్రమ	05	79.44	77.53
కేజీబీవీ	27	88.14	86.97
మున్సిపల్	04	79.12	63.77
ఏపీఎంఎస్	20	95.11	88.51
ప్రైవేట్	172	97.37	95.14
సోషల్ వెల్ఫేర్	06	95.23	94.78
ట్రైబల్ వెల్ఫేర్	07	89.7	82.85
జిల్లా పరిషత్	181	76.57	71.54

● మే 19వ తేదీ నుంచి సప్లిమెంటరీ

10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు విద్యాసంవత్సరం నష్టపోకుండా మే 19వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. 19 వతేదీ నుంచి 28 వతేదీ వరకు పరీక్షలుంటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

● రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 24వ తేదీ నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ వెల్లడించింది. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.1000లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, మే 1వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే ఫీజులు చెల్లించాలని, ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరించడం జరుగదన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ చేసుకునే విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని, స్కూళ్ల ద్వారానే దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

● డాక్టర్ కావాలని ఉంది
- ఇఫ్రత్, 599 మార్కులు, నంద్యాల



నేను ఎప్పుడూ 24 గంటలు చదివేదాన్ని కాదు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు మాత్రమే చదువుతాను. తర్వాత ఏ పుస్తకం పట్టుకోను. అప్పుడప్పుడూ సెల్‌ఫోన్‌లో వస్తున్న సెమినార్‌లను తీక్షణంగా చూస్తాను. నాకు ఏదైనా అర్థం కాకుంటే వెంటనే టీచర్లను సంప్రదించి క్లియర్ చేసుకుంటాను. ఎప్పుడూ నేను ఒత్తిడికి గురికాలేదు. డాక్టర్ అయి పేదలకు సేవ చేయాలని ఉంది. కొందరు వైద్యులు అధిక ఫీజులు వసూలు చేస్తుండడం ప్రత్యక్షంగా చూసి ఆశ్చర్యపోయా. ఏమైనా సరే ఖచ్చితంగా డాక్టరు అయి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా సేవ చేయాలని ఉంది.

'గురురాజ' విద్యార్థికి 597 మార్కులు



నంద్యాల శ్రీగురురాజ విద్యాసంస్థల విద్యార్థి యర్రం వెంకట సాయి సుబ్బనర్సిరెడ్డి 600 మార్కులు 597 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. 597 మార్కులు సాధించడంపై దొర్నిపాడు గ్రామానికి తల్లిదండ్రులు నర్సిరెడ్డి, సుజాతలు హర్షం వ్యక్తం చేశారు. తమ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందని గురురాజ విద్యాసంస్థల ఛైర్మన్ దస్తగిరిరెడ్డి, డైరక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి అన్నారు. ఐఐటీ చేసి మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించి స్థిరపడి తమకోసం ఎంతో కష్టపడుతున్న తల్లిదండ్రులకు అండగా ఉంటానని వెంకటసాయి తెలిపారు.



● డోన్ పట్టణంలోని సుధా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి విజయ దుర్గాప్రసాద్ 597 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాచారు. తండ్రి జ్ఞానశేఖర్, తల్లి నాగరాణిలు. తండ్రి ఆటోమెకానిక్‌గా పనిచేస్తూ కుమారున్ని చదివిస్తున్నాడు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేసి తండ్రి ఆశయాన్ని నెరవేరుస్తానని అంటున్నారు.



● ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన డాక్టర్ పీవీ నాగేశ్వరరాజు, రాజ్యలక్ష్మీ కుమార్తె భవ్య దీప్తిక 597 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఆమె డాక్టర్ కావడమే తన లక్ష్యమని తెలిపారు.



●నంద్యాల గుడ్‌షెప్పర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన సాయి సహస్ర, దీక్షితారెడ్డి, వెంటకసాయిసంతోష్‌లు 596 మార్కులు సాధించారు.



● పాములపాడు మండలంలోని ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థి జంగాల మల్లన్న 593 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. వారి తల్లిదండ్రులు సాయిలు, యల్లమ్మలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడిని మంచిగా చదివించుకోవాలని రెక్కలు ముక్కలు చేసుకుని అహర్నిశలు శ్రమించారు. అయితే ఆ తల్లిదండ్రుల ఆశయాలను ఏ మాత్రం నీరుకార్చకుండా మల్లన్న కష్టపడి చదివి 593 మార్కులతో టాపర్‌గా నిలిచారు. రైతు బిడ్డగా మరిన్ని విజయాలు సాధించి కలెక్టర్ అవుతానని చెబుతున్నారు.

ప్రజాపత్రిక ఆంధ్రజ్యోతి

- ప్రజాదరణతో మరింత చేరువ
- పాఠకుల్లో ప్రోత్సాహం కోసమే 'బైక్ అండ్ కార్ రేస్'
- విజేతలకు బహుమతుల ప్రదానం


ప్రథమ విజేత వీరేష్‌కు బైక్ కొనుగోలు చెక్కును అందజేస్తున్న ఆంధ్రజ్యోతి కర్నూలు యూనిట్ సిబ్బంది

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అక్షరమే ఆయుధంగా... ప్రజా సమస్యలే అజెండాగా... పాఠకుల ఆదరణ చురగొంటూ ఆంధ్రజ్యోతి పత్రిక దినదినాభివృద్ధి సాధిస్తోందని 'బైక్ అండ్ కార్ రేస్' విజేతలు కొనియాడారు. పాఠకులకు మరింత చేరువ కావడంతోపాటూ ఆంధ్రజ్యోతి కుటుంబంలో వారిని భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి సంస్థ 'కార్ అండ్ బైక్ రేస్' లక్కీ డిప్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేపట్టింది. ఇటీవల కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆంధ్రజ్యోతి యూనిట్ ఆఫీసులో లక్కీ డిప్ ద్వారా జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి బైకు, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ విజేత డి.వీరేష్‌కుమార్, ద్వితీయ విజేత పువ్వాడ శంకర నారాయణ, తృతీయ విజేత సి.వెంకటేశ్‌లకు బుధవారం బహుమతులను అందజేశారు.

(మిగతా 7లో)


ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్‌తో విజేత శంకర నారాయణ



తృతీయ బహుమతి కలర్ ఎల్‌ఈడీ టీవీతో విజేత వెంకటేశ్

రోడ్డెక్కిన పొగాకు రైతు

- అమ్మేందుకు వెళ్తే నాణ్యత లేదంటూ వెనక్కి
- పొగాకును రోడ్డుపై వేసి నిప్పు పెట్టి నిరసన
- కేజీ రోడ్డుపె స్తంభించిన ట్రాఫిక్

వివరాలు 6లో

పన్నులు చెల్లిస్తేనే గ్రామాభివృద్ధి

- నెలాఖరులకు పన్నుల వసూలు పూర్తి
- ఈనెల చివరికి 100 శాతం వసూలు చేస్తామంటున్న అధికారులు

నంద్యాల రూరల్ ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పన్నులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించింది. గ్రామ పంచాయతీల్లో ఏ ఏ మార్గాల్లో ఆదాయం వస్తుందో అధికారులకు సూచించింది. దీంతో నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 90 శాతం పన్నులు వసూలు చేశారు. ఏప్రిల్ చివరికి పూర్తిగా వంద శాతం పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. నంద్యాల జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు 2024-2025 మార్చి 31 నాటికి రికార్డు స్థాయిలో 90 శాతం పన్నులు చేశారు. ఈ ఆర్థిక ఏడాదికి ఇంటి పన్ను, నీటి పన్నులు, వ్యాపార పన్నులు, (ట్యాక్స్) రూ. 6.5 కోట్లు వ్యవసాయ ఉత్పత్తులు, వ్యాపార అనుమతులు (నాన్ ట్యాక్స్) రూ.5.3 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు చెప్పారు. ప్రజలు పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగం చేయడానికి అధికారులు ఈ పని ముమ్మరంగా చేశారు.

● నంద్యాల జిల్లాలో 28 మండలాలు ఉన్నాయి. వీటిలో ఉయ్యాలవాడ మండలంలో మాత్రమే వంద శాతం పూర్తి చేశారు. తక్కువగా 61.04 రుద్రవరం మండలంలో పన్నులు వసూలు చేశారు. నాన్ ట్యాక్స్ విభాగం ఆత్మకూరు, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, పాణ్యం వందశాతం గతేడాదికి సంబంధించిన పన్నులు వసూలు చేశారు. కానీ తక్కువగా 45.60 ఉయ్యాలవాడ మండలంలో వసూలు చేశారు. ఈ నెలలో పూర్తిగా జిల్లాలో వందశాతం పన్నులు రెండు విభాగాల్లో వసూలు చేయాలని జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామాల్లో చర్యలు

జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామల్లో పంచాయతీ కార్యదర్శులుతో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, పన్నులు చెల్లించడం వల్ల వారి గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని ప్రచారం చేశారు. తద్వారా ప్రజలు స్వతహాగా పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ సభలు, ర్యాలీలు, ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



గ్రామ పంచాయతీ కార్యాలయం



పారిశుధ్యానికి పెద్ద పీట....

జిల్లా పంచాయతీ శాఖ గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్ద పీట వేస్తుంది. ఈ మేరకు చెత్తను ఆదాయ వనరుగా మార్చే ప్రక్రియను చేపట్టింది. జిల్లాలో ఉన్న 150 గ్రామాల్లో మొదటి దశలో వందశాతం చెత్త సేకరణ చేయాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నది. గ్రామంలో ఆరోగ్యానికి విఘాతం కల్గిస్తున్న చెత్తను క్లాప్‌మిత్ర ద్వారా సేకరించి డంపింగ్ షెడ్లకు తరలిస్తున్నారు. వీటిలో 94 గ్రామ పంచాయతీల్లో 100 శాతం ప్రతి రోజు చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు ఎరువుగా మార్చి గ్రామాలకు ఆదాయ వనరుగా చేస్తున్నారు. ఇందులో భాగంగా 489 గ్రామాలకు గాను 348 సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 278 పూర్తిగా పని చేసున్నాయి. 70 పాక్షికంగా పని చేస్తున్నాయి. 141 గ్రామాల్లో అసలు పనులు మొదలు కాలేదు. వీటిని అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

జిల్లాలో వివరాలు ఇలా....
(ట్యాక్స్) మండలాలు: 28
గ్రామ పంచాయతీలు: 489

పన్నులు	పాతవి (కోట్లల్లో)	కొత్తవి	మొత్తం	వసూలు	చేయాల్సినవి
	రూ.2.820306 లక్షలు	రూ.76189104	రూ.79003410	రూ.64432798	రూ.24364953
(నాన్ ట్యాక్స్)	రూ.3379165	రూ.59586324	రూ.62965489	రూ.52653851	రూ. 9276548

ఆడిట్ అధికారుల తనిఖీలు
- శ్రీశైలం దేవస్థాన రికార్డులు, ఖర్చుల పరిశీలన



శ్రీశైలం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానానికి సంబంధించిన పలు రికార్డులను బుధవారం ఆడిట్ అధికారులు తనిఖీ చేశారు. జిల్లా ఆడిట్ అధికారి ఆదేశాల మేరకు 18 మంది ప్రతేక ఆడిట్ అధికారులు 2018-19, 2019-20, 2022-23 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, బ్యాంకు లావాదేవీలు, ఖర్చులు వంటి అంశాలపై తనిఖీ చేయనున్నట్టు స్థానిక సహాయ ఆడిట్ అధికారి (ఏఏఓ) రమేష్ తెలిపారు. దేవస్థానంలో పనిచేయు ప్రతి ఉద్యోగి సర్వీసు వ్యవహారాలను కూడా ప్రత్యేకంగా తనిఖీ చేయనున్నట్లు ఆడిట్ అధికారులు తెలిపారు. ఆలయం, వసతి, పారిశుధ్యం, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగంతో పాటు మిగిలిన అన్ని విభాగా లకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను ఆడిట్ అధికారులకు అందజేయాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఆదేశించారు. ఆడిట్ తనిఖీలలో అభ్యంతరాలు ఉత్పన్నమైతే పూర్తి బాధ్యత సంబంధిత విభాగాధిపతులు, గుమాస్తాలు బాధ్యత వహించాలని ఈవో సూచించారు. సుమారు నెల రోజులపాటు తనిఖీలు నిర్వహించ్చనున్నట్లు ఏఏఓ తెలిపారు. మూడు సంవత్సరాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను ఆడిట్ తనిఖీలు చేసి అభ్యంతరాలను డీడీఓకు నివేదిక ఇస్తారన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలి

- భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి
- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జేసీ చాంబర్‌లో జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై సంబంధిత కమిటీ సభ్యులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పాణ్యం, సంగమేశ్వరం, సంజామల, బోయవాండ్లపల్లె గ్రామాల్లో పర్యాటక అభివృద్ధి కోసం గతంలో భూములు కేటాయించామని, ఆ భూములను మ్యుటేషన్ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేటాయించిన భూములను దురాక్రమణలకు గురికాకుండా కంచె ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అహోబిలంలోని ఇరిగేషన్ శాఖకు సంబంధించి 2.5ఎకరాల భూమిని కేటాయిస్తే అందులో త్రీస్టార్ హోటల్ ఏర్పాటుతోపాటు బండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామంలో కేసీకెనాల్‌కు పరీవాహక ప్రాంతానికి చెందిన 2ఎకరాలు కూడా టూరిజంకు కేటాయిస్తే అందులో బోటింగ్, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటుచేసి టూరిజం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణ మూర్తి, ఏపీటీడీసీ డీవీఎం లక్ష్మినారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి నాగమునేశ్వరి, డీఎస్‌డీవో రాజు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్, అధికారులు

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వన్యప్రాణులకు రక్షణ కరువైంది. వేటగాళ్లు తుపాకులకు నిత్యం వన్యప్రాణులు బలైపోతున్నాయి. ముఖ్యంగా జింకలను చంపి, గుట్టు చప్పుడు కాకుండా వాటి చర్మం, మాంసాన్ని పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బడా బాబులు అయితే జింక మాంసంతో విందులు, వినోదాలు చేసుకుంటున్నారనే వదంతులు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తేనే స్పందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వన్య ప్రాణుల సంరక్షణకు కఠిన చట్టాలున్నా అవి అమలుకు నోచుకోవడం లేదని విమర్శలున్నాయి. ఆదోని, ఆలూరు, మంత్రాలయం మండలాల్లోని చాగి, నారాయణపురం, దానాపురం, ముసానహళ్లి, కాత్రికి, మనేకుర్తి, కమ్మరచేడు మర్కట్టు ప్రాంతాల్లో హైదరాబాద్‌కు చెందిన కొందరు వేటగాళ్లు కృష్ణ జింకలపై వేట సాగిస్తున్నట్లు సమాచారం.



వన్యప్రాణులపై తూటా!



- వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్న జింకలు
- జంతు సంరక్షణను గాలికొదిలేసిన అటవీ అధికారులు
- కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆగని వేట

ఆదోని, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయి. కానీ అవి అమలు కావడం లేదు. జిల్లాలో ఎక్కడో ఒక చోట జింకలు వేటగాళ్ల తుపాకీ తూటాలకు మరణిస్తున్నాయి. 2022 మార్చి 7వ తేదీన హైదరాబాద్‌కు చెందిన వేటగాళ్లు, దుండగులు జీప్‌లో వచ్చి తుపాకులతో జింకల మందపై కాల్పులు జరిపారు. 12 జింకలు ప్రాణాలు కోల్పోయాయి. చనిపోయిన జింకల తలలు మొండాలను వేరు చేసి, మాంసంతో అక్కడి నుంచి వేటగాళ్లు ఉడాయించారు. అది మరవకముందే మరోసారి నారాయణపురం అడవుల్లో తుపాకుల శబ్దాలు వచ్చినట్లు స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతంలో వంకలు ఉండడంతో దాహం తీర్చుకునేందుకు వచ్చిన జింకల మందపై ఒక్కసారిగా తుపాకులతో కాల్పులు జరపడంతో మృతి చెందిన జింకలతో ఉడాయించారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పరిపాటిగా మారాయి.

● జింకల వేటలో బడా బాబుల పుత్ర రత్నాలు..?

మార్చి నెలలో ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాలలోని పొలాల్లో 12 కృష్ణ జింకలను చంపిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన బడా బాబుల పుత్ర రత్నాలు ఉన్నట్లు సమాచారం. ఈ విషయం అటవీశాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులకు తెలియడంతో కేసు లేకుండా పైరవీలు సాగించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన బడా నేతల పుత్రుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే నిందితుల వివరాలు బైట పడతాయని స్థానికులు అంటున్నారు.



● దొరికితే జైలు-జరిమానా

అటవీ జంతువులను పెంచుకోవడం, వేటాడటం నిషిద్ధం. వన్యమృగాలను చంపడం, వాటి మాంసం కలిగి ఉండటం నేరమని వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 చెబుతోంది. ఈ చట్టంలో ఇటీవల కొన్ని మార్పులు చేశారు. నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.50లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఈ రెండింటినీ ఏకకాలంలోనూ అమలు చేయొచ్చుని అధికారులు పేర్కొంటున్నారు. అంతరించిపోతున్న వన్యప్రాణుల రక్షణకు ఈ చట్టాన్ని కఠినతరం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. వాస్తవానికి గ్రామ పరిసరాల్లోకి అడవి జంతువులు వచ్చినా వాటికి హానీ తలపెట్టకూడదు. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఈ విషయమై అటవీ అధిరాని తేజస్వినిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మార్చి 6వ తేదీన కేసు నమోదు చేసామని, ఆ వ్యక్తి గన్నుతో దొరికాడని తెలిపారు.. జంతువులను వేటాడుతున్నట్టు తెలుసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు అక్కడి నుండి పరారయ్యారని, వారికోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. నిందితులు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు.



జింకల తలలను వేరు చేసిన దృశ్యం(ఫైల్‌ఫోటో)

రోడ్డెక్కిన పొగాకు రైతు

- అమ్మేందుకు వెళ్తే నాణ్యత లేదంటూ వెనక్కి
- పొగాకును రోడ్డుపై వేసి నిప్పు పెట్టి నిరసన
- కేజీ రోడ్డుపె స్తంభించిన ట్రాఫిక్
- రైతుల పట్ల వివక్ష చూపలేదన్న కంపెనీ ప్రతినిధులు



రోడ్డుపై పొగాకుకు నిప్పు పెట్టి నిరసన తెలుపుతున్న పొగాకు రైతులు

నందికొట్కూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు పొగాకు సాగు శాపంగా మారింది. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పొగాకును కొనుగోలు చేసేందుకు అలయన్స్ కంపెనీ అధికారులు నాణ్యత లోపాన్ని చూపుతున్నారు. వెనక్కి పంపుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతులకు తమ ఇష్టం వచ్చినట్లుగా ధరలో కోతలు విధిస్తూ అధికారులు తమకు తీరని అన్యాయం చేస్తున్నారని రైతులు రోడ్డెక్కారు. కొనుగోలు చేయాలని రైతులు నిలదీస్తే నాణ్యత లోపం ఉంది, ఇస్తే తక్కువ ధరకు ఇవ్వండి లేదంటే మీచావు మీరు చావండి అంటూ రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం నందికొట్కూరు మార్కెట్ యార్డు సమీపంలోని గోదాము వద్ద తమకు మద్దతు ధర ఇవ్వలేదంటూ కేజీ రోడ్డుపై పొగాకు బేళ్లను వేసి నిప్పుపెట్టి రైతులు ఆందోళనకు దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనను విరమింపజేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కంపెనీ నిర్వాహకులు నాణ్యత పేరుతో తమకు తీరని అన్యాయం చేస్తున్నారని వాపోయారు. పొగాకు బేళ్లను తీసుకొచ్చిన ప్రతి సారి తమకు ధరలో కోతలు విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఇది ఒక్క రోజు మాత్రమే కొనుగోలు చేస్తామని కంపెనీ సిబ్బంది చెబుతున్నారని దీంతో తమ వద్ద ఉన్న బేళ్లను ఎవరు కొంటారని రైతులు వాపోతున్నారు. అనంతరం కంపెనీ అధికారులు రైతులతో మాట్లాడుతూ తాము మాత్రం నాణ్యతను బట్టి కంపెనీ నిబంధనల మేరకే ధరను నిర్ణయిస్తున్నామే తప్ప రైతుల పట్ల ఎలాంటి పక్షపాతం చేపడం లేదని అలయన్స్ కంపెనీ మేనేజర్ విజయ్ తెలిపారు.

ఆత్మహత్యలే శరణ్యం



అలయన్స్ కంపెనీ క్వింటాళ్లు పొగాకు రూ.15,500 కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేయించుకున్నారు. ఇప్పుడు నాణ్యత పేరుతో రూ.5 వేలకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. కౌలుకు తీసుకొని 30 ఎకరాల్లో చుక్కబర్లి పొగాకును సాగు చేశా. కౌలు, పెట్టుబడి అంతా కలిపి రూ.50లక్షలు ఖర్చు అయింది. ఇంతవరకు అమ్మిన పొగాకుకు రూ.6లక్షలు మాత్రమే వచ్చాయి. ఒప్పంద ధరకు పొగాకు కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

- రామకృష్ణ, రైతు, మిడ్తూరు

ఒప్పంద ధర కల్పించాలి



15 ఎకరాల్లో పొగాకు వేశా. ఇప్పుడు మూడోసారి వచ్చా. వచ్చిన ప్రతిసారి వెనక్కు పంపుతున్నారు. ఒప్పందం ప్రకారం రూ.15,500 ఇవ్వాలి. కాని ఇక్కడికి వచ్చాక రూ.5 వేలు మాత్రమే ధర వేస్తున్నారు. నాణ్యత లేదంటూ వెనక్కు పంపుతున్నారు. అలయన్స్ కంపెనీ సిబ్బంది కనికరించడం లేదు. కొనుగోలు చేయకపోతే చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకోనే పరిస్థితి.

-అలీమ్‌బాషా, చౌట్కూరు గ్రామం, మిడ్తూరు మండలం



రైతుల తీసుకొచ్చిన పొగాకు వేళ్లను ఎండలో వేసిన దృశ్యం

అడ్మినిస్ట్రేటర్‌కే ఎఫ్‌ఆర్‌ఎస్ బాధ్యతలు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు కచ్చితమైన వేళకు విధులకు హాజరయ్యేలా అమలు చేస్తున్న ముఖ ఆధారిత గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్) బాధ్యతలు ఇక నుంచి కర్నూలు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం నిర్వహించనున్నారు. బుధవారం అడ్మినిస్ట్రేటర్ ఉద్యోగులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్ఆర్ఎస్ మెయిన్ అకౌంటును తీసుకున్నట్లు క్లర్క్ నుంచి పాస్‌వర్డ్‌ను తీసుకుని మార్పు చేసినట్లు తెలిపింది. కాంట్రాక్టు, ఏజెన్సీ ఉద్యోగులు 3 సార్లు కంటే ఆలస్యం గా వచ్చిన గైర్హాజర్ అయిన వారికి నోటీసులు లేదా సస్పెండ్ చేస్తామన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు మూడుసార్లు ఆలస్యంగా వచ్చిన వారికి కూడా ఖచ్చితంగా నోటీసులు జారీ చేస్తామన్నారు. సెలవులు మంజూరు విషయంలో స్క్రూటినీ చేసి హెచ్‌వోడీలతో మాట్లాడి ఎఫ్ఆర్ఎస్‌లో అప్రువల్ చేస్తానని తెలిపారు.

వ్యర్థానికి అర్థమేది..?



మున్సిపాలిటీలో మూలన పడేసిన జిరాక్స్ మిషన్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. వాటి వల్ల భవిష్యత్తులో జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాత ఎలక్ట్రానిక్ వస్తువులను పురపాలక సంఘం ఆధ్వరంలో రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను నంద్యాలలో రెండు ఏర్పాటు చేశారు. కానీ నంద్యాల పురపాలక సంఘం కార్యాలయంలో మాత్రం పాడైపోయిన జిరాక్స్ మిషన్‌ను ఇలా ఒక మూలన పడేశారు. దీంతో ప్రజలు ఎలా పాత వస్తువులను ఇస్తారు. సంఘం వారే అవగాహన కల్పించాల్సింది పోయి వారే నిర్లక్ష్యంగా ఇలా చేయడం పలు విమర్శలకు తావిస్తోంది

ఆలోచింపజేసిన తరమెళ్లిపోతున్నది

●ఆసాంతం ఆకట్టుకున్న నాటక ప్రదర్శన ● టీజీవీ కళాక్షేత్రంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు



కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు



తరమెళ్లిపోతున్నదో నాటకంలోని సన్నివేశం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సంబంధాల విచ్ఛిన్నంపై ఆలోచనాత్మకంగా సాగిన 'తరమెళ్లిపోతున్నది' సామాజిక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ ఆర్ట్స్ సంస్థ కె.రామకృష్ణ దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం టీజీవీ కళాక్షేత్రంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ నాటకంలో రామకృష్ణ, డాక్టర్ శ్రీజ సాదినేని, కరణం సరిత, నల్లక శ్రీధర్, పోగతి నాగేశ్వరరావు నటించారు. సమకాలీన సమాజంలో అన్నదమ్ముల సంబంధాల్లోని సంక్షోభాలు ఇతివృత్తంగా సాగిన ఈ నాటకం ప్రేక్షకులను ఆలోచనలకు గురి చేసింది. కళాకారుల హావభావాలు, డైలాగులకు ప్రేక్షకులను ఆలరింపజేశాయి. అనంతరం కళాకారులకు టీజీవీ కళాక్షేత్రం తరపున అధ్యక్షులు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. భావి తరాలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు జన్మదిన వారోత్సవాలను పెద్దఎత్తున కళాకారులు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఇల్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ కర్నూలు అభివృద్ధి కోసం మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నారని అన్నారు.

● నేడు సినిమా సంగీత విభావరి

చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో ఐదో రోజు సాయంత్రం 6 గంటలకు సినిమా సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గజల్ గాయకుడు మహమ్మద్ మియా, గాయని సుధారాణి ఆధ్వర్యంలో ఈ సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

నేడు 'బొమ్మల గాథలు' పద్యకావ్యం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవి డి. పార్వతయ్య రచించిన 'బొమ్మల గాథలు' పద్య కావ్యం ఆవిష్కరణ సభ నగరంలోని టీజీవీ కళాక్షేత్రం సాహిత్య వేదిక హాలులో ఏర్పాటు చేసినట్లు సాహితీ స్రవంతి నగర కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు అధ్యక్షత వహిస్తారని, ప్రభుత్వ కళారత్న పురస్కార గ్రహీత విద్వాన్ పత్తి ఓబులయ్య పద్య కావ్యం ఆవిష్కరిస్తారని తెలిపారు. నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా పుస్తక సమీక్ష చేస్తారని, ప్రధాన వక్తగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ప్రసంగిస్తారని తెలిపారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకంపై అంగన్‌వాడీ పరిధిలోని గర్భిణులకు అవగాహన కల్పించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి పి.నిర్మల సూచించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంపై కర్నూలు ఐసీడీఎస్ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం ప్రయోజనాలు పొందేందుకు గర్భిణులు పేర్లను నమోదు చేసే సమయంలో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా నమోదు చేయాలన్నారు. గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను, సేవలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి టి.శారద, కర్నూలు, నంద్యాల జిల్లాల సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'బెల్టు' తెరిచారు..

- విచ్చలవిడిగా దుకాణాలు
- కమీషన్ పెంచని ప్రభుత్వం
- రూ. వంద కోట్ల లక్ష్యం
- పావులు కదుపుతున్న ఎక్సైజ్ శాఖ
- మితిమీరిన రాజకీయ జోక్యం
- రూ.75 కోట్లు దాటిన అమ్మకాలు
- అవకతవకలకు అవకాశమే లేదు: డీసీ



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): మద్యం అమ్మకాలను పెంచేందుకు తెగబడ్డారు. దుకాణాలకు ఎక్సైజ్ శాఖ టార్గెట్లు నిర్ధేశించడంతో అక్రమ మార్గాలకు తెరలేపారు. జిల్లాలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలను తెరిచి అమ్మకాలకు తెగబడుతున్నారు. ఎప్పుడూ లేనివిధంగా గ్రామాలు, పట్టణాల్లో అమ్మకాలు చేపడుతున్నామని దుకాణదారులే చెబుతున్నారు. ప్రభుత్వం టెండర్ ప్రక్రియకు ముందు చెప్పిన కమీషన్ పెంచకపోవడంతో అమ్మకాలు చేపడితే తప్ప దక్కించుకున్న టెండర్ గిట్టుబాటు అయ్యే పరిస్థితులు లేవని తెగేసి చెబుతున్నారు. ఈక్రమంలో మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ఈనెలకు వంద కోట్ల టార్గెట్ లక్ష్యంగా నిర్ధేశించడం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎలాగైన అమ్మకాల్లో లక్ష్యాన్ని పూర్తిచేయాలని పావులు కదుపుతోంది. టెండర్ ప్రక్రియలో మద్యం దుకాణాలను దాదాపుగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, అనుచరులు దక్కించుకున్నారు. వారి అడ్డగోలు అమ్మకాలు, బెల్టుషాపులకు అడ్డుకట్ట వేయలేక ఎక్సైజ్, పోలీస్ శాఖలు తలలు పట్టుకుంటోంది. విచ్చలవిడిగా బెల్టుషాపులను ఏర్పాటుచేశారు. ఎక్కడ పడితే అక్క డ దుకాణాల వద్ద టెంట్లు వేసి సిట్టింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం అనధికారికంగా టార్గెట్లు విధించడంతో చేసేదేమీ లేక అమ్మకాలు అను కున్న లక్ష్యం చేరితే చాలు అన్న తీరులో కాలం వెల్లదీస్తున్నామని ఓసీఐ చెప్పడం కొసమెరుపు. ప్రతిరోజు బెల్టుషాపుల ద్వారా రూ.1.40 కోట్ల దాకా వ్యాపారం సాగుతు న్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని 109 మద్యం దుకాణాలు, 28బార్లు, 4 టూరిజం, క్లబ్బులాంటి వాటి ద్వారా బుధవారం నాటికి రూ. 76 కోట్ల మద్యం అమ్మకాలు జరిగనట్లు అధికారులు తెలిపారు.

నాణ్యమైన మద్యం విక్రయాలు..

ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని ప్రైవేట్ షాపుల ద్వారా విక్రయిస్తోంది. జిల్లాలో మొత్తం 109 బ్రాందీ షాపులు ఉన్నాయి ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే విక్రయాలు జరపాల్సి ఉంటుంది. అక్కడ మందు తాగేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకూడదు. అన్ని రకాల మద్యం బ్రాండ్లను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలి. అంటే అక్కడ కొనుగోలు చేయడం. ఇంటికి వచ్చి తాగాలి. ఇందుకు గాను ప్రభుత్వం 14 శాతం లైసెన్సుదారులకు కమీషన్ ఇస్తుంది.

మామూళ్ల మత్తులో నియంత్రణాధికారులు..

బ్రాందీ షాపు కేవలం అమ్మకాలే జరగాల్సి ఉంటే అక్కడ పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకుని ఆడ్డగోలుగా తాపిస్తున్నా.. పోలీసు, ఎక్సైజ్ శాఖలు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మద్యం అమ్మకాలు సక్రమంగా జరగడం, కల్తీ లేకుండా చూడడం, ఇతర ప్రాంతాల నుంచి మద్యం సరఫరా రాకుండా చూడడం కోసం ఎక్సైజ్ శాఖ లో ఎన్‌ఫోర్స్ మెంట్, టాస్క్‌ఫోర్సు, స్టేట్ టాస్క్‌ఫోర్సు బృందాలు ఉంటాయి. ఇవన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు అమ్మకాలు జరిగేలా చూడాలి. జిల్లాలో ఆ పరిస్థితి లేదు. నెలనెలా ఎక్సైజ్, సివిల్ పోలీసులు భారీగా ముడుపులు తీసుకుని బ్రాందీ షాపుల యాజమానులకు పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా బ్రాందీ షాపులు బార్లను తలపిస్తున్నాయి. సిట్టింగ్‌ల కోసం రేకుల షెడ్లు, దిమ్మెలు, కూర్చునేందుకు సీట్లు ఏర్పాటుచేసి తాపిస్తున్నారు. అయినా పోలీసులకు అవి కనిపించడం లేదు. షాపు స్థాయిని బట్టి ప్రతి నెలా రూ.వేలల్లో వసూళ్లు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

భయాందోళనలో జనాలు

కర్నూలు నగర శివారులో గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులతో జనం భయాం దోళనకు గురవుతున్నారు. గతంలో తాలుకా సీఐ గంజాయి బ్యాచ్‌పై కేసులు నమోదు చేసినా పరిస్థితుల్లో మార్పులేదు. దీనికి తోడు మద్యం దుకాణాల వద్ద తాగుబోతులు మద్యం మత్తులో నిత్యం హల్‌చల్ చేస్తున్నారు. దీంతో ఫ్యామిలీస్ అటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దూపాడు వద్ద దేవుడి పేరుతో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం దుకాణాల్లో సిట్టింగ్‌లు ఏర్పాటుచేశారు. పంట పొలాలు నాశనమవుతున్నాయని కమ్యూనిస్టు పార్టీల నాయకులు గ్రామస్థులతో కలిసి ఎక్సైజ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు.

నిర్దేశించిన ధరలకే అమ్మకాలు..



మద్యం అమ్మకాల్లో తేడా వస్తే ఉపేక్షించం. దుకాణాల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరగాలి. బెల్టుషాపులు కనిపిస్తే కఠినచర్యలు చేపడతాం. ఇప్పటికే ఎన్నో కేసులు నమోదు చేశాం.

- శ్రీదేవి, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ

ప్రజాపత్రిక ఆంధ్రజ్యోతి

• ప్రజాదరణతో మరింత చేరువ • పాఠకుల్లో ప్రోత్సాహం కోసమే 'బైక్ అండ్ కార్ రేస్' • విజేతలకు బహుమతుల ప్రదానం



మూడో బహుమతి కలర్ టీవీని అందుకుంటున్న వెంకటేష్

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదటి మూడు బహుమతులతో పాటు ఆకర్షణీయమైన వంద కన్సోలేషన్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఎ.లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠకుల ఆదరాభిమానాలను చురగొంటూ ఆంధ్రజ్యోతి దినపత్రిక ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, పక్కా సమాచారంతో వార్తలు ఇచ్చేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అనునిత్యం ముందుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి కర్నూలు ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ జి.గోపాల్, సోనో విజన్ బ్రాంచ్ ఇన్‌చార్జి అచ్యుతరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బహుమతులు అందుకున్న విజేతలు తమ ఆనందాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

మరువలేని ఆనందం



ఆంధ్రజ్యోతి పాఠకుడిగా కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో ప్రథమ విజేతగా నిలిచి బైక్‌ను గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఫోన్ చేసి ఆంధ్రజ్యోతి లక్కీ డ్రాలో బైక్ గెలుచుకున్నావని చెప్పగానే నా ఆనందం మాటల్లో చెప్పలేకున్నాను. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్నాను. వార్తలు చాలా బాగా వస్తున్నాయి. ఆ వార్తలే నన్ను ఆంధ్రజ్యోతికి మరింత చేరువ చేసింది. బైక్ కొనుగోలుకు సంబంధించిన చెక్కును అందుకోగానే చాలా సంతోషం అనిపించింది. థ్యాంక్యూ ఆంధ్రజ్యోతి.

- డి.వీరేష్‌కుమార్, వ్యాపారి, ప్రథమ విజేత, గూడూరు

పదేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిని



పదేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిగా ఉన్నాను. పత్రికలో ప్రతీ వారం ప్రచురితమయ్యే 'ఆర్కే కొత్తపలుకు' క్రమం తప్పకుండా చదువుతాను. నేను చిరుద్యోగిగా పనిచేస్తున్నాను. వార్తలు నాలో స్ఫూర్తిని రగిలించాయి. దమ్మున్న వార్తలు ప్రచురించడంలో ఆంధ్రజ్యోతికి మరోపత్రిక సాటిరాదు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో ఈ పత్రిక ప్రజల పక్షానే ఉంటుంది. అందుకే ఆంధ్రజ్యోతి అంటే ఎంతో ఇష్టం. కార్, బైక్ రైస్ లక్కీ డ్రాలో ద్వితీయ విజేతగా నిలిచి రిఫ్రిజిరేటర్ బహుమతిగా అందుకోవడం మరువలేని ఆనందాన్ని ఇచ్చింది.

- పువ్వాడ శంకర నారాయణ, ద్వితీయ విజేత, నంద్యాల

బహుమానం అమ్మకు ఇస్తా



ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రాలో జిల్లాలో తృతీయ విజేతగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. నాకు కలర్ టీవీ బహుమతిగా ఇచ్చారు. మా ఇంట్లో టీవీ ఉంది. మా అమ్మకు టీవీ లేదు. చాలా రోజుల నుంచి అమ్మకు ఒక కొత్త టీవీ కొనివ్వాలని అనుకుంటున్నాను. ఆంధ్రజ్యోతి బహుమతిగా ఇచ్చిన కలర్ టీవీని మా అమ్మకు బహుమతిగా ఇస్తాను. ఆరేళ్లుగా ఆంధ్రజ్యోతిని చదువుతున్నాను. జిల్లా పేజీలో వచ్చే వార్తలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. నిర్భయంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వార్తాకథనాలు ప్రచురించడం ఆంధ్రజ్యోతికే సాధ్యం. ఆంధ్రజ్యోతి మరింత అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాను.

- సి. వెంకటేశ్, తృతీయ విజేత, కోడుమూరు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పోస్టాఫీస్ సమీపంలో సాయి(24) అనే వ్యక్తికి రెండేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలోనే అతను ఏడాది పాటు కాశీలో ఓ స్వామిజీ వద్ద సాధనలో ఉంటూ వారం రోజుల క్రితం ఆత్మకూరుకు వచ్చాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు ఎవరు కారణంగా కాదని తల్లి, తమ్ముడు క్షమించాలని సూసైడ్ లెటర్ రాశాడు. ఉదయాన్నే అతడు ఇంటి తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారు అనుమానం వచ్చి ఇంట్లోకి చూడగా ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వగా ఏఎస్సై శంకరరెడ్డి ఘటనాస్థలికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు తల్లి కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



సాయి (ఫైల్)

భర్త వేధింపులతో వివాహిత...

ఓర్వకల్లు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నన్నూరు మాలపేటలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మాలపేటకు చెందిన బలగం అంజలి(25) ఇంట్లో బుధవారం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తిరుమలేష్‌తో వివాహమై ఎనిమిది నెలలైంది. కొంతకాలం భర్త అనోన్యంగా ఉండేవాడని, ఇటీవలే వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. భర్త వేధిస్తుండటంతో తాళలేక ఉరేసుకొని మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపంతో ఆలూరుకు చెందిన సిద్ధప్ప అనే విద్యార్థి బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు బళ్ళారి ఆస్పత్రికి రెఫర్ చేశారు.

పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి

• నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటసుబ్బయ్య
• 'ఉపాధి' పనుల తనిఖీ

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగే పని ప్రదేశాల్లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం మండలంలోని బాపనంతాపురంలో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. పని ప్రదేశంలో మస్టర్లను పరిశీలించారు. మండుతున్న ఎండల దృష్ట్యా పని ప్రదేశంలో కూలీలు జాగ్రత్తలు పాటించాలని, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. రోజుకు రూ307 వేతనం అందేలా కూలీలకు కొలతలు కేటాయించాలని ఏపీవో నాగార్జునకు ఆదేశించారు. గ్రామంలోని పశువుల నీటి తొట్టిని పరిశీలించారు. ఆ తొట్టిలో ప్రతిరోజు నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.



నీటి తొట్టిని పరిశీలిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

ఉద్యోగ బాధ్యతల్లో బదిలీ సాధారణం

• సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి



బదిలీ అయిన న్యాయాధికారితో మహిళా న్యాయవాదులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ బాధ్యతల్లో బదిలీలు సర్వ సాధారణమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి అన్నారు. నంద్యాలలో విధులు నిర్వర్తిస్తూ జడ్జిల బదిలీల్లో భాగంగా విజయవాడకు బదిలీ అయిన రాధారాణికి నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాధారాణి మాట్లాడుతూ బెంచ్‌కి, బార్ సహాయ సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాష, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి కృష్ణారెడ్డి, రామచంద్రరావు, ద్వారకనాథ్, రాజేశ్వరి, సౌజన్య చిన్నలింగమయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో లాభాలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటల సాగుతో లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్త తోటల అభివృద్ధి కింద 1,940 హెక్టార్లలో ఉద్యాన పంటలు అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు స్పష్టంచేశారు. ఎంఐడీహెచ్ కింద 890 హెక్టార్లు, ఆర్‌కేఈవై కింద 550హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వీటిని అధిగమిస్తామని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 500 హెక్టార్లలో ఆయిల్‌పాం పంటను సాగు చేస్తామని అర్హులైన రైతులను మే నెలా చివరిలోగా గుర్తిస్తామని స్పష్టంచేశారు.

జగన్‌ను జైలుకు పంపాలి

• కూటమి కక్ష సాధింపునకు పాల్పడదు
• గొడవలు సృష్టించేందుకు జగన్‌రెడ్డి కుట్రలు
• టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజల సొమ్ము దోచేసిన ఆర్థిక ఉగ్రవాది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బెయిల్ రద్దుచేసి జైలుకు పంపాలని కుడా ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, ఈడీ వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ దగ్గర పనులు చేసిన ఎంతో మంది అధికారులు వారి ప్రమేయం లేకుండా ద్రోహులుగా నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీలో మైనింగ్, మద్యం, ఇసుక, లిక్కర్ వంటి వాటిలో కోట్లాది రూపాయలు జగన్‌కు ముట్టచెప్పిడంలో వారి పాత్ర నేడు బయట పడటంతో వారు సిట్ అధికారుల ముందు ద్రోహులుగా నిలబడ్డారని తెలిపారు. గతంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎన్నోసార్లు తెలుగుదేశం పార్టీ చెప్పిందని, అయినా కూడా వారు వైసీపీ కొమ్ము కాయడంతో పాటు తప్పిదాలకు పాల్పడంతో వారి పట్ల చట్టం తన పని తాను చేస్తోందని, ఎవరిపైన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తీసుకోదన్నారు. జగన్‌లా చంద్రబాబు ఏనాడు కక్ష సాధింపులకు పాల్పడలేదని, మీరుచేసిన పాపాలు మిమ్ములను వెంటాడుతున్నాయన్న విషయాన్ని మర్చిపోవద్దని కోరారు. ప్రస్తుతం జగన్‌రెడ్డి రాష్ట్రంలో అల్లర్లు, గొడవలు, అరాచకాలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని, ఇలాంటి వాడిని బయట తిరగకుండా ఈడీ వెంటనే అక్రమాస్తుల కేసులో బెయిల్ రద్దు చేయాలని కోరారు.



వేదవతికి నిధులు కేటాయించాలి

• ప్రాజెక్టు సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి • ఆలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల మహా ధర్నా



తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, లేదంటే ఆలూరు ప్రాంతం ఏడారిలా మారిపోయే ప్రమాదం ఉందని వేదవతి ప్రాజెక్టు కార్యాలయం వద్ద వేదవతి ప్రాజెక్టు సాధన కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలని పాలకులు, ప్రభుత్వాలు అనుకోవడం లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకురా వడానికి రైతులు కలిసిరావాలన్నారు. 8 టీఎంసీలను సద్వినియోగం చేసుకునేం దులకు వీలుగా అలుగు నిర్మాణంపై దృష్టి సారించి సూమారు 80వేల ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. రాయసీమ జల సాధన కమిటీ నాయకుడు దశరథరామిరెడ్డి, సీపీఐ ఎంఎల్ నాయకులు సవారప్ప, పీడీఎస్‌యూ నాయకులు అఖండ, మునిస్వామిలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

• రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించి 28 మంది హిందువులను ఊచకోత కోయడం దారుణమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో విహారయాత్రలకు వెళ్లిన వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. అమాయకులను చంపడం దారుణమన్నారు. ఈ దాడుల్లో ఇద్దరు తెలుగు వారు మృతి చెందడం బాధాకరమన్నారు. ఉగ్రవాదుల అమానుష దాడిని ఖండిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం మంత్రి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకుల్లో మనోధైర్యం వీడరాదన్నారు. మానవత్వం ఉన్న ఎవరూ ఇలాంటి దాడులు చేయరన్నారు కూటమి ప్రభుత్వం ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలిస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ఐక్యంగా ఉండి దేశ ద్రోహులను కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఇలాంటి దాడులు చేసిన ఉగ్రవాదులకు ఎన్డీయే ప్రభుత్వం గుణపాఠం చెబుతుందని మంత్రి అన్నారు.



దాడి పిరికిపంద చర్య

• నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని నంద్యాల డీసీసీ అధ్యక్షులు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉగ్రమూక దాడిలో 30 మంది చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఇటువంటి చర్యలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారికి నష్ట పరిహారంగా రూ.కోటి చెల్లించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్ దినోత్సవానికి ఎంపీడీవోలు, జడ్పీటీసీలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న మంగళగిరిలో జరిగే పంచాయతీరాజ్ దినోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీడీవోలు, జడ్పీటీసీ, ఎంపీపీలు హజరుకానున్నాట్లు జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమానికి కర్నూలు జిల్లా నుంచి ఎంపిడీవోలు-3, నంద్యాల జిల్లా-3, కర్నూలు నుంచి జడ్పీటీసీలు కర్నూలు-2, ఎంపిపీలు-3, ఎంపీటీసీలు-2, నంద్యాల జిల్లా నుంచి జడ్పీటీసీలు-2, ఎంపీపీలు-3, ఎంపిటీసీలు-2 హాజరు కానున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

• పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత
• మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ

కల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్ పహల్గాం, బైసాన్ సమీపంలో పర్యాటకులపై ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత డిమాండ్ చేశారు. ఉగ్రదాడిని ఖండిస్తూ చనిపోయిన వారిఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే నివాసం నుంచి అమ్మా హస్పిటల్ వరకు తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కొవ్వొత్తులు వెలిగించి శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానూభూతి ప్రకటించారు. టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, కె.పార్వతమ్మ, ప్రభాకర్‌యాదవ్, బి.నాగిరెడ్డి, ఈవీ.రమణ, డి.రామాంజనేయులు, మాదేశ్ పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్నఎమ్మెల్యే గౌరు చరిత, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కాటసాని ఆధ్వర్యంలో..

పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్నమ్మసర్కిల్లో ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన దాడి దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఈదాడిలో ఏపీకి చెందిన చంద్రమౌళి, మధుసూదన్‌తో పాటు 28 మందిని కోల్పోవటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉగ్రవాదుల నరమేధంపై కోటేష్ చిత్రం



నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ జమ్ముకశ్మీర్ సంఘటనపై స్పందించి ఉగ్రవాదుల నరమేధంపై చిత్రం గీశారు. కశ్మీర్‌లో ఉగ్రవాద భూతం విరుచుకు పడింది. 26 మంది భారతీయుల ప్రాణాలు కోల్పోయారు. సందడిగా వున్న ఆ ప్రాంతం ఒక్కసారిగా ఆర్తనాదాలతో దద్దరిల్లింది. ఉగ్రవాదుల తూటాల వర్షంతో 28 మంది పర్యాటకులు ప్రాణాలు వదిలారు. తన బిడ్డలు చూసి భారతమాత కన్నీరు పెడుతుంది. నెత్తురు మరిగిన రాక్షసులు. రక్తదాహం తీరలేదు. విగతజీవులుగా నెత్తురు మడుగులో వున్నారు. ఇకనైనా మన దేశం ఉగ్రవాదంపై దృఢంగా పోరాడాలి. ప్రాణాలు కోల్పోయిన వారికి కన్నీటి నివాళులు.

నర్సింగ్ స్టూడెంట్‌కు వేధింపులు

• సెక్యూరిటీ గార్డు తొలగింపు

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో క్లీనికల్ కోసం వచ్చిన ఓ ప్రైవేటు నర్సింగ్ స్టూడెంట్‌ను సెక్యూరిటీ గార్డు వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బుధవారం నర్సింగ్ స్టూడెంట్ అధికారులకు ఫిర్యాదు చేసింది. రెండు నెలలుగా వేధిస్తున్నాడని, ఇన్‌స్టాగ్రాంలో పేరు నమోదు చేయాలని ఫోన్‌చేసి వేధిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్‌కు ఫిర్యాదు చేసింది. వేధింపులు తాళలేక చదువు మానేసి, స్వస్థలం కేరళకు వెళ్లాలనుకున్నానని ఫిర్యాదులో పేర్కొంది. స్పందించిన అధికారులు విచారణ చేసి సదరు సెక్యూరిటీ గార్డును విధుల నుంచి తొలగించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సంకిరేణిపల్లెలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పగిడ్యాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పగిడ్యాల గ్రామానికి చెందిన మొల్ల నాజీమున్‌బీ, సంకిరేణిపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య బుధవారం అందజేశారు. నాజీమున్‌బీకి రూ. 3లక్షలు, రామకృష్ణకు రూ. 1.10 లక్షల చెక్కులను వారి ఇండ్ల వద్దకు వెళ్లి అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, దామోదర్‌రెడ్డి, భూషిగౌడ్ ఉన్నారు.

విద్యాభివృద్ధికి సహకారం



మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రావు

మహానంది, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి సహకరిస్తానని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస కోసం తనవంతు విరాళం అందించినట్లు నంద్యాల మధుమణి హస్పిటల్ అధి నేత డాక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం బొల్లవరం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల అభివృద్ధికి రూ.70 వేలు విరాళం అందజేశారు. ఈసందర్భంగా వైద్యుడిని కిలారి వెంకటేశ్వర్లు, నాగిశెట్టి వెంకటసుబ్బయ్యతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సన్మానిం చారు. నేస్తం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

మహానంది, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి కొలిమిగుండ్లకు చెందిన చౌడయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు నంద్యాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. బుధవారం మహానంది మండలం గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్‌లో వెళ్తున్న రైలు నుంచి వ్యక్తి కిందపడటం గమనించిన స్టేషన్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై అక్కడికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు పోగొట్టుకొన్న చౌడయ్యను చికిత్స కోసం నంద్యాలకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తమ మార్కులు సాధించిన బాల బాలికలు
- అభినందనలు తెలిపిన ఉపాధ్యాయులు



సాయిస్ఫూర్తి (596)



సద్దల తనుశ్రీ (595)



మల్లన్న (593)



యశస్విని (591)



పి. శరణ్య (591)



ఎన్. సుమంత్ (591)



నవ్యశ్రీ (588)



లావణ్య (584)

ఆత్మకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో 1165 మంది విద్యార్థులకు గానూ 900 మంది పాసవ్వడంతో 77.25 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గౌతమ్ హైస్కూల్‌కు చెందిన సద్దల తనుశ్రీ 600 మార్కులకు గానూ 595 మార్కులు సాధించింది. డీపాల్ హైస్కూల్‌కు చెందిన అఫ్సన్ 592 మార్కులు, శ్రీచైతన్య హైస్కూల్‌కు చెందిన సాయిదినేష్ అనే విద్యార్థి 588 మార్కులు సాధించారు. ఆత్మకూరు జడ్పీ బాలికల పాఠశాలకు చెందిన అర్షియా పర్వీన్ 563, ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన దీపికా యాదవ్ 560 మార్కులు, వెంకటాపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన లీలావతి, జడ్పీ బాలికల హైస్కూల్ ఆత్మకూరుకు చెందిన అర్షియా పర్వీన్, సాధియ 555 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

బండిఆత్మకూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 431 మందికి విద్యార్థులకు గానూ 356 మందితో 83 శాతం ఉత్తీరణత సాధించినట్లు విద్యాధికారులు తెలిపారు. బండిఆత్మకూరు హైస్కూల్ విద్యార్థి ఎన్. సుమంత్ 591, ఎర్రగుంట్ల హైస్కూల్ ఎన్.శృతి 584, ఈర్నపాడు హైస్కూల్ విద్యార్థి వి.కావేరి 580 మార్కులు, కేజీబీవీకి చెందిన కె.నిఖిత 562 మార్కులు సాధించారు.

మహానంది: మండలంలో 463 మంది విద్యార్థులకు గానూ 311 మంది పాస్ అయ్యారని ఎంఈవో రామసుబ్బయ్య తెలిపారు. 67.2 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన చెప్పారు.

వెలుగోడు: వెలుగోడు డీపాల్ పాఠశాలకు చెందిన సాయిస్ఫూర్తి 596, లిటిల్ ఏంజిల్ పాఠశాలకు చెందిన శరణ్య 591, నవ్యశ్రీ 588 మార్కులు సాధించారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన షేక్‌సాదిక్ 582 మార్కులు సాధించారు.

నందికొట్కూరు: నందికొట్కూరులోని విజయవాణి హైస్కూల్‌కు చెందిన జి.జయంత్ 596, డి.రస్మిత 591, అఫ్‌సినా 590 మార్కులు సాధించారు. బ్రాహ్మణకొట్కూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన టి.పావని 581 మార్కులు సాధించారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మోడల్ స్కూల్ విద్యార్థిని హారిక 584, మండ్లెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన కల్పన 577, మోడల్ స్కూల్‌కు చెందిన విష్ణు 576, బీబీ అఫ్సానా 575 మార్కులు సాధించారు.

మిడుతూరు: మోడల్ స్కూల్ విద్యార్థి శివశంకర్ 576 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సలీం బాషా తెలిపారు. మిడుతూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి మల్లికార్జున 566 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం సాయి తిమ్మయ్య తెలిపారు. మండలంలో 426 మంది విద్యార్థులకు గానూ 305 ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనాథ్ తెలిపారు.

పగిడ్యాల: నెహ్రూనగర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థి చెన్నకేశవులుగౌడ్ 570 మార్కులు సాధించాడు. మండలంలో 413 మంది విద్యార్థుకు గానూ 342 మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ఎంఈవో సుభాన్ తెలిపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన మోహన సుధ 567, లక్ష్మాపురం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని నిర్మల 548, పగిడ్యాల కేజీబీవీ పాఠశాలకు చెందిన సుగానంద 513, ముచ్చుమర్రి జడ్పీ పాఠశాలకు చెందిన ఇంద్రాణి 508 మార్కులు సాధించారు.

కొత్తపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 319 మంది విద్యార్థులకు గానూ 259 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 81.19 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. వీరాపురం చెందిన బొర్రెడ్డి ప్రవల్లిక 582, కొత్తపల్లికి చెందిన బొర్రెడ్డి దీపిక 574, కొత్తపల్లికి చెందిన ఉషశ్రీ 555 మార్కులు సాధించారు.

పాములపాడు: పాములపాడు మోడల్ స్కూల్‌లో మల్లన్న 593, యశస్వినీ 591, పాములపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజేష్ 519, వాణాల జడ్పీ హైస్కూల్ విద్యార్థి నిత్యసాయి 519, మిట్టకందాల పాఠశాలలో సమీరా 519, వేంపెంట జడ్పీ హైస్కూల్‌లో లావణ్య 584, తుమ్మలూరు జడ్పీ హైస్కూల్‌లో మహాలక్ష్మి 553, కేజీబీవీలో వైష్ణవి 510 మార్కులు సాధించారు.

సున్నిపెంట: సున్నిపెంటలో బీసీ గురుకుల పాఠశాలకు చెందిన పి.రాంజాన్ 592, ఎ.వేదసాయికృష్ణ 588, కె.విష్ణు 585, పి.దస్తగిరి 584 మార్కులు సాధించారు. డిఏవీ పాఠశాల విద్యార్థులు ఆర్.మైత్రేయి 593, కేబీ షణ్ముఖ 593, వీరేంద్ర 590, వాసవీ 590 మార్కులు సాధించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలో సునావత్ రేవంత్ నాయక్ 590, రమావత్ ఈశ్వర్ నాయక్ 584, ముద్దే శ్రీనివాసులు నాయక్ 579 మార్కులు సాధించారు.

పాణ్యం: పాణ్యం మండలంలో 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కోటయ్య తెలిపారు. బలపనూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని హర్షియా బేగం 581, బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని 589 మార్కులు, కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు నాగసత్య మనికంఠ, వెంకట అభినవరెడ్డి 596 మార్కులు సాధించారని చెప్పారు.

గడివేముల: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 371 మంది విద్యార్థులకు గానూ 266 మంది ఉత్తీర్ణత సాధించారు. గని హైస్కూల్‌లో చదివిన ప్రేమ్‌కుమార్ 566, ఆదర్శ పాఠశాల విద్యార్థి షరిఫాబీ 564, గడివేములలోని రాజరాజేశ్వరి హైస్కూల్ విద్యార్థి స్వామినాథ్ 579 మార్కులు సాధించారు. శ్రీభారతి 577 మార్కులు సాధించింది.

గోస్పాడు: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి వెంకట సుధాగాయత్రి 582, కేజీబీవీకి చెందిన కార్తీక 571, యాళ్లూరు జడ్పీహెచ్‌ఎస్‌లో సంతోష్‌కుమార్ 567, దీబగుంట్ల జడ్పీహెచ్‌ఎస్‌లో నాగవైష్ణవి 551, గోస్పాడు జడ్పీహెచ్‌ఎస్‌లో నాగదీపిక 511 మార్కులు సాధించారు.



ఎన్.శృతి (584)



హరిక (584)



వెంకట సుధాగాయత్రి (582)



బొర్రెడ్డి ప్రవల్లిక (582)



వి.కావేరి (580)



స్వామినాథ్ (579)



శ్రీభారతి (577)



విష్ణు (576)



శివశంకర్ (576)



బీబీ అఫ్సానా (575)



బొర్రెడ్డి దీపిక (574)



చెన్నకేశవులుగౌడ్ (570)



మల్లికార్జున (566)



అర్షియా పర్వీన్ (563)



కె.నిఖిత (562)



ఉషశ్రీ (555)

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

పాములపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన భరత్ (8) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. గత నెల 3వ తేదిన సోమేశ్వరుడు అనేరైతు అప్పులబాధ తాళలేక తనతో పాటు కుటుంబ సభ్యులకు కూల్‌డ్రింక్‌లో పరుగుమందు కలిపి తాపించాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స పొందుతున్నారు. అయితే బుధవారం భరత్ అనే చిన్నారి మృతి చెందాడు. మిగిలిన వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

నంద్యాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా నేరనియంత్రణలో భాగంగా బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. సైబర్ క్రైం, బాల్యవివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, గ్రామాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులు గ్రామసభలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి గణపతికి విశేష అభిషేకం

శ్రీశైలం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకళ్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధ జలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులను సమర్పించారు. జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మో దకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ఆత్మకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూ లిద్దామని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్వప్న ప్రియదర్శిని పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సి పల్ కార్యాలయంలో వార్డు సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. బాలల సంరక్షణా అధికారి శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణ, అధ్యాపకులు సుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అంతర్జాతీయ ఆంగ్ల భాష దినోత్సవాన్ని నిర్వహించారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



ర్యాలీ చేస్తున్న ముస్లింలు, వామపక్షాల నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని నందికొట్కూరు పట్టణంలో ముస్లింలు, వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలాన రఫీక్ జామయి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని ముస్లీం మైనార్టీ సమాజాన్ని బలహీన పరిచేలా కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. జేఏసీ నాయకులు సలాంఖాన్, దౌలత్ బాషా, అబ్దుల్ రెహమాన్, మహబూబ్ బాషా, వామపక్ష నాయకులు నాగేశ్వరరావు, నరసింహులు, రఘురాంమూర్తి, వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, రజిత, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

'చెరువులో మట్టి తవ్వకాలను సహించం'



ధర్నా చేస్తున్న నాయకులు

మహానంది, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో రైతులకు సాగు, తాగు నీరుకు ఉపయోగపడే గోపవరంలోని భైరవాణి చెరువులో మట్టి తవ్వకాలను సహించబోని, వెంటనే అనుమతులను రద్దు చేయాలని గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మహానంది మండలం గోపవరం సమీపంలోని భైరవాణి చెరువు వద్ద గుంటూరు-గుంతకల్లు బ్రాడ్ గేజ్ పనులకు చెరువు మట్టిని వాడుకోవాలని ఇటీవల మైనింగ్‌శాఖ అనుమతులు ఇవ్వడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది మంది రైతులు చెరువు వద్దకు వెళ్లి ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. 40 ఎకరాల్లో మట్టి తరలింపుకు అనుమతి ఇవ్వడం వల్ల భవిష్యత్తులో చెరువులో నీరు నిల్వ ఉండే అవకాశం లేదన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబా ఫకృద్దీన్, గురుమూర్తి, సామేలు, ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ

పాణ్యం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్పెషల్ భారత్ ఈవెంట్స్‌లో పాణ్యం విద్యార్థి సింగారపు బాలచంద్రుడు తృతీయ స్థానం సాధించినట్లు ఐఈడీ ఎస్ఎస్ శివసాయిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 23 వతేదీన ఏలూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థి పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. విద్యార్థిని ఎంఈవో కోటయ్య, సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం మేరీ సునీత, ఐఈడీఎస్ఎస్ ఆరుణకుమారి, సంపూర్ణరావు అభినందించారు.

'ఉగ్రవాదుల దాడి అమానుషం'


నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉదగ్రవాదుల దాడి అమానుషమని బీజేపీ నాయకులు అన్నారు. టెర్రరిస్టుల చర్యలను తీవ్రంగా ఖండిస్తూ మృతుల ఆత్మకు శాంతి కలగాలని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో సంతాపం తెలిపి వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఇనుగూరి రమేష్‌బాబు, కశెట్టి చంద్రశేఖర్, గోస్పాడు మండల అధ్యక్షుడు మధుగోపాల్, నాయకులు బెక్కం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎర్రమల బాలముని, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కశ్మీర్‌లో ఉగ్రవాద ఘటన బాధాకరమని శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబాన, టీడీపీ ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. మృతులకు సంతాపం వ్యక్తం చేస్తూ స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళి అర్పించారు.

- కశ్మీర్‌లోని ఉగ్రవాదులు పర్యాటకులను హతమార్చడం అమానుషమైన ఘటన అని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుసేన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులను ఉగ్రవాదులు అతిదారుణంగా హతమార్చడం బాధాకరమని, ఇది మానవత్వానికే మాయని మచ్చ అని అన్నారు. ఉగ్రదాడి క్షమించరానిదని, ఎవరూ ఇలాంటి ఘటనలను ఆక్షేపించరని అన్నారు.

బండిఆత్మకూరు: కశ్మీర్‌లో పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను వదలి పెట్టవద్దని మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్ ఆర్మీలో పనిచేస్తున్న మహబూబ్‌బాషా అన్నారు. బుధవార రాత్రి మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో ప్రజలతో కలిసి ఆయన ర్యాలీ చేపట్టారు. ముందుగా మృతులకు నివాళ్ళు అర్పించారు.

నంద్యాల కల్చరల్: ప్రశాంతంగా వున్న కాశ్మీర్‌లో పర్యాటకులపై తీవ్రవాదులు దాడి చేసి మతం చూసి కాల్చి చంపిన సంఘటనతో దేశమంతా దిగ్భ్రాంతి చెందింది. ఈ సంఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలకు విశ్వహిందూ పరిషత్ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి మాట్లాడుతూ గురువారం సాయంత్రం 5గంటలకు విశ్వహిందూ పరిషత్ కార్యాలయం నుంచి నిరసన కార్యక్రమం చేపట్టబోతున్నామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొషోర్, సహకార్యదర్శి నాగరాజు, ఆర్ఎస్ఎస్ నాయకులు చిలుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నంద్యాల రూరల్: కశ్మీర్‌లో భారత యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషం అని సీపీఐ నాయకులు రంగనాయుడు, బాబాఫకృద్దీన్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

- కశ్మీర్‌లో జరిగిన దాడికి నిరసనగా హిందూ, ముస్లీం, మైనార్టీ, క్రిష్టియన్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి ప్రమాదకరమని అరు. బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, దాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు బెన్ హిన్ వుటికేలా, సత్యనారాయణ, శివరామిరెడ్డి, అబ్దుల్ మజీద్ పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్పీజీ చర్చి వార్షికోత్సవాలు



ముత్యాలపాడులో ఎస్పీజీ చర్చి ముఖద్వారం

చాగలమర్రి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ చర్చి పురాతనమైన చర్చిగా పేరొందిన ప్రార్థన మందిరం 134 ఏళ్ల పూర్తి చేసుకుంటోంది. అత్యంత సుందరంగా నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరని కట్టడంగా చరిత్రలో నిలిచి పోయింది. 134 ఏళ్ల చర్చి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎస్పీజీ చర్చిలో 24, 25, 26 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు డీనరీ చైర్మన్ సంజీవరాజు తెలిపారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

● **25న రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు**

ముత్యాలపాడు ఎస్పీజీ చర్చి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 25న రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు ఏర్పాటు చేసినట్లు డీనరీ చైర్మన్ సంజీవరాజు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు, ఏడో బహుమతి రూ.4 వేలు, ఎనిమిదో బహుమతి రూ.3 వేలు నగదును దాతలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

ముస్లింల ధార్మిక ఉనికికి ప్రమాదం



నిరసన ర్యాలీలో పాల్గొన్న జేఏసీ నాయకులు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముస్లింల ధార్మిక ఉనికికి ప్రమాదం ఏర్పడిందని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరు వాల బాష అన్నారు. బుధవారం వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మూడు రోడ్ల కూడలి నుంచి ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్యకు కమిటీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. వైసీపీ నాయకుడు భూమి కిషోర్ రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, ఎంపీపీ వసీం, సీపీఎం నాయకులు రామచంద్రుడు, సీఐటీయూ నాయకులు రమేష్ బాబు, కాంగ్రెస్ నాయకులు రజియా , వివిధ సంఘాల నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

డోన్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న మల్కాపురంలో సుంకులా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు కూడా కన్నుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సుంకులమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజ చేశారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, చిన్నమల్కాపురం సుధాకర్ రెడ్డి, వలసల బాలుడు, మోపు మద్దయ్య జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

ప్యాపిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతమ్మతండా ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షనీయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి అలేబాదు పరమేష్ పాఠశాలకు రూ.20వేలు విలువ చేసే మైకు సెట్‌ను బుధవారం ఎమ్మెల్యే కోట్ల చేతుల మీదుగా సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్‌ను, శ్రీకాంత్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సయ్యద్ అల్లాబకాష్ వలి ఉరుసు

బేతంచెర్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని బలపాలపల్లె గ్రామ రస్తాలో వెలసిన సయ్యద్ అల్లాబకాష్ వలి ఉరుసు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు స్వామివారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా ప్రాంగణమంతా కిటకిటలాడింది. ఈ సందర్భంగా దర్గా ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాల్వ రామసుబ్బయ్య, లింగమూర్తి, ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై విచారణ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుడి గ్రామంలో హిందూ శ్మశాన వాటిక స్థలం ఆక్రమణపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 21న గ్రామస్థులు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదును తహసీల్దార్ కార్యాలయానికి ఉన్నతాధికారులు పంపారు. అయితే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిశీలించాల్సిన రెవెన్యూ అధికారులు ఫిర్యాదుదారులను రెవెన్యూ కార్యాలయానికి పిలిపించడం గమనార్హం. జంగిల్ క్లియరెన్స్ చేసుకోవాలని రెవెన్యూ సిబ్బంది కొలతలు వేస్తారని అధికారులు తెలియజేసినట్లు గ్రామస్థులు వివరించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు గ్రామస్థులను కార్యాలయానికి పిలిపించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

రామ్‌కో ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల పరిధిలో గల రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు పీఏసీ రామస్వామి రాజా జయంతిని పురస్కరించుకొని బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రామ్‌కో అడ్మిన్ హెడ్ రామరాజు, యూనిట్‌హెడ్ మీనాక్షి సుందరం శిబిరాన్ని ప్రారంభించగా 165మంది రక్తదానం చేశారు. నంద్యాల ప్రభుత్వ జనరల్ వైద్యశాల డాక్టర్ల బృందం రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రామ్‌కో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ కళాశాలలు దూసుకుపోతున్నాయని ఇందుకు నిదర్శనం ఇటీవల వచ్చిన ఇంటర్ ఫలితాలే అని ప్రిన్సిపాల్ గంగన్న తెలిపారు. బుధవారం ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెయిర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, విజయలక్ష్మి, వెంకటసుబ్బయ్య, జయచంద్రా, వెంకటేష్ కుమార్, హుసేనయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

చాగలమర్రి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో పెనుగాలుల బీభత్సంతో దెబ్బతిన్న బొప్పాయి, మామిడి, అరటి తోటలను బుధవారం పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఏవో రంగ నేతాజీ, నాయకులు అన్సర్‌బాషా, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

బాలికలదే హవా..

- 'పది' ఫలితాల్లో గ్రామీణ విద్యార్థినుల ప్రతిభ
- హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు
- విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు



షాహినా



గాయత్రీ



అంబికాశ్రీ

చాగలమర్రి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కాగా మండలంలో బాలికల హవా కొనసాగింది. చాగలమర్రి గ్రామంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని గాయత్రీ 581 మార్కులు, మద్దూరు గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని షాహినా 581 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. చైతన్య భారతి పాఠశాల విద్యార్థిని అంబికాశ్రీ 584 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు షాహినా, గాయత్రీలను పాఠశాల హెచ్ఎంలు విజయలక్ష్మి, నరసింహారెడ్డి, చైర్మన్ ఉసేన్‌సా, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, తల్లిదండ్రులు అభినందించారు. బాలుర ఉన్నత పాఠశాలలో 196 మందికి 140 మంది, బాలికల పాఠశాలలో 108 మందికి 65, పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో 39 మందికి 15, చింతలచెరువు ఉన్నత పాఠశాలలో 25కు 17, చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో 73కు 49, మద్దూరు ఉన్నత పాఠశాలలో 17కు 13, కస్తూర్బా పాఠశాలలో 40కు 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలలో 205 మందికి 197 మంది ఉత్తీర్ణులై 96 శాతం రాణించారు.

హ్యాట్రిక్ సాధించిన బాలికోన్నత పాఠశాల

చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల 2023 నుంచి 2025 వరకు పది పరీక్షా ఫలితాల్లో హ్యాట్రిక్ సాధించింది. బుధవారం పది పరీక్షా ఫలితాల్లో ప్రథమంగా గాయత్రీ 581, రెండో స్థానం ఐజయ్య అలీ 576, మూడవ స్థానం సమ్రిల్ 558 మార్కులు సాధించారని హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. మూడు సార్లు మండలంలో ప్రథమ స్థానంలో రాణించారని తెలిపారు. టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉయ్యాలవాడ మండలంలో..

ఉయ్యాలవాడ: మండలంలో పది పరీక్షలు 270 మంది విద్యార్థులు రాయగా 232 మంది ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు టాప్ త్రీలో నిలిచారు. ఆ పాఠశాలకు చెందిన సీ. మధుసుదన్ 582 మార్కులు సాధించి మండల టాప్‌గా నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన బి. నాగనితీష్‌రెడ్డి 576 మార్కులు సాధించి రెండవ స్థానంలో, సి. రోగినిస్వేత 576 మార్కులతో మూడవ స్థానంలో రాణించింది. బోడెమ్మనూరు పాఠశాలలో 95.6 శాతం మంది, ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలో 85.1 శాతం, హరివరంలో 82.4 శాతం మంది, కస్తూర్బా బాలికల పాఠశాలలో 78.4 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్యాపిలి మండలంలో..



సుహానా

ప్యాపిలి: ప్యాపిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సుహాన 584 మార్కులతో మండల టాపర్‌గా నిలిచారు. అలాగే జలదుర్గం ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థి జగదీష్ 575 మార్కులతో రెండవ స్థానంలో, పీఆర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని లహరి 570 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారు. అలాగే అలేబాదు ఆశ్రమ పాఠశాల 80శాతం, హుసేనాపురం 85శాతం, రాచెర్ల 97శాతం, బూరుగుల 88శాతం, పోతుదొడ్డి 95శాతం, చిన్నపూదిళ్ల 71శాతం, ఏనుగమర్రి 72శాతం, ప్యాపిలి బాలుర పాఠశాల 53శాతం, కేజీబీవీ 85శాతం, పీఆర్‌పల్లి 75శాతం, ప్యాపిలి బాలికల పాఠశాల 84శాతం, జలదుర్గం పాఠశాల 79శాతం, శ్రీసరస్వతి శిశుమందిరం 97శాతం ఉత్తీర్ణత సాధించాయి.

శిరివెళ్ల మండలంలో..



మోడల్ స్కూల్ విద్యార్థిని గుమ్మ కావ్యను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు



హర్షవర్ధన్‌రెడ్డి

శిరివెళ్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మొత్తం 588 మంది విద్యార్థులకు గాను 490 మంది ఉత్తీర్ణులవ్వడంతో 83 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు ఎంఈవో నాగార్జునరెడ్డి బుధవారం తెలిపారు. శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో 86 మందికి గాను 81 మంది ఉత్తీర్ణులై 94 ఉత్తీర్ణత శాతం సాధించారు. పాఠశాలకు చెందిన గుమ్మ కావ్య అనే విద్యార్థిని 587 మార్కులతో మండల టాపర్‌గా నిలిచారు. హర్షవర్ధన్‌రెడ్డి అనే విద్యార్థి 579 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థులను ఎంఈవో నాగార్జునరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. శిరివెళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 39 మంది విద్యార్థులకుగాను 38 మంది ఉత్తీర్ణులై 97.5 ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియంలో 22 మంది విద్యార్థులకుగాను 20 మంది ఉత్తీర్ణులై 83శాతాన్ని సాధించారు.

డోన్ మండలంలో..

డోన్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన బి.విజయలక్ష్మి 590/600 మార్కులు సాధించారు. అదేవిధంగా మౌనిక 578, హరిక 574, జస్మిత 557మార్కులు సాధించారు. వీరితో మరికొంత మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షైమున్నీసా తెలిపారు.

కోవెలకుంట్లలో..



ఎస్.హరిత

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూలు విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థి ఎస్.హరిత 600/591 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మొత్తం 20మంది హాజరు కాగా అందరూ విజయం సాధించారు. దీంతో స్కూలు యాజమాన్యం, ప్రిన్సిపాల్ సిస్టర్ గీతా ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

దొర్నిపాడు మండలంలో..

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన ఆలమూరి మహేశ్వరి 587 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పాఠశాల చైర్మన్ నగిరి సుధాకర్ తెలిపారు. రెండో స్థానంలో దొర్నిపాడు జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన తోట సాయి ధనూష్ 572 మార్కులు, మూడవ స్థానంలో కె.సౌజన్య 564 మార్కులు, నాల్గో స్థానంలో జుబేరి 563 మార్కులు సాధించి సత్తా చాటారు. భాగ్యనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.అఖిల 562 మార్కులు, ఎం.వరలక్ష్మి, 546, ఎస్. ఇర్ఫాన్ 544, డబ్ల్యూకొత్తపల్లె పాఠశాలలో సి.నందిని 530 మార్కులు, డి.ఉషారాణి 505, ఓ.పవిత్రి 491, అమ్మిరెడ్డినగర్ గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో ఎ.సుబ్బలక్ష్మి 514, వై.కావ్య 493, మంజుల 491 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులకు జడ్పీహెచ్ చైర్మన్ సుధాకర్, ఎంఈవోలు రామచంద్రయ్య, మనోహర్‌రెడ్డి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఆళ్లగడ్డ పట్టణంలో...

ఆళ్లగడ్డ: పట్టణంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అమ్మాయిలదే పై చేయిగా నిలిచింది. పట్టణానికి చెందిన చైతన్య పాఠశాల విద్యార్థిని నాగ భవ్యదీపిక 597 మార్కులు సాధించి పట్టణ టాపర్‌గా నిలిచింది. అలాగే విశ్వశాంతి పాఠశాలకు చెందిన మహ్మద్ ఆదిల్‌కు 596 మార్కులు వచ్చాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి పిరుమల్ల హస్సీ 569 మార్కులు సాధించింది. గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం కీర్తనకు 590 మార్కులు వచ్చాయి.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చెందిన విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో 77 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి సోమశేఖర్ బుధవారం తెలిపారు. మండలంలోని మొత్తం 1096 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయగా. వాటిలో 848 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

బనగానపల్లె మండలంలో..



షన్ముఖశ్రీ

బనగానపల్లె: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 64.06 శాతం ఉత్తీర్ణత సాధించారు. బనగానపల్లె మండలంలో ప్రభుత్వ జడ్పీ, ఉన్నత, బాలికల పాఠశాలలు మొత్తం 15 ఉండగా 1096 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 702 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 64.06 శాతం సాధించారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో బనగానపల్లె బాలికల ఉన్నతపాఠశాలకు చెందిన తాళంకి షన్ముఖ శ్రీకి 579 మార్కులు సాధించి బనగానపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా నిలిచారు. ఇందులో కస్తూర్బా స్కూల్ బాలకల విద్యాలయంలో 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఇందులో పి.శాంతి అను బాలికలకు 547 మార్కులు, శృతికి 506 మార్కులు, ఆల్మాస్‌కు 502 మార్కులు సాధించారు. మోడల్‌స్కూల్ విద్యార్థులు 82.05 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు. ఈ పాఠశాలలో మహబూబ్‌భాష అను విద్యార్థికి 565 మార్కులు సాధించారు.

కొలిమిగుండ్ల మండలంలో..



బంగారు మనీషా



హర్షవర్ధన్



కళ్యాణ్‌బాబు



తేజశ్విని

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మండలంలో మొత్తం 533మంది విద్యార్థులు పరిక్షలు రాయగా, 417మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో 78.3శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం వెల్లడించారు. ఇందులో అత్యధికంగా అంకిరెడ్డిపల్లె జడ్పీ పాఠశాల విద్యార్థిని బంగారు మనీషా 575 మార్కులు సాధించగా, హర్షవర్ధన్, సుమశ్రీ 574 మార్కులు, మోడల్ స్కూల్ కళ్యాణ్‌బాబు 562 మార్కులు, కస్తూర్బా పాఠశాల తేజశ్విని 555 మార్కులు సాధించారు. కాగా, కేజీబీవీ పాఠశాలలో 37మంది విద్యార్థులు పరిక్షలు రాయగా 36 మంది ఉత్తీర్ణత సాధించి, మండలంలో మొదటిస్థానంలో నిలిచింది.

రుద్రవరం మండలంలో..



నాగేంద్ర



తులసీశ్వరుడు



ధరణి



హరిప్రియ



భవజ్ఞ



సాయితేజ

రుద్రవరం : మండలంలోని యల్లావత్తుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగేంద్ర 592 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో వీరరాఘవయ్య బుధవారం తెలిపారు. అదే పాఠశాలకు చెందిన తులసీశ్వరుడు 585 మార్కులు సాధించాడు. రుద్రవరం కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపల్ లక్ష్మీదేవి అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో వందశాతం విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించారు. ధరణి 575, హరిప్రియ 563, భవజ్ఞ 557 మార్కులు సాధించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులను ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అభినందించారు. ఈ పాఠశాలకు చెందిన సాయితేజ 570 మార్కులు సాధించారు. అలాగే లలితప్రియ 567, హరిత 567, రజని మంచి మార్కులు సాధించిందన్నారు. రుద్రవరం ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు మంచి మార్కులు సాధించారని హెచ్ఎం సుబ్బరాయుడు తెలిపారు.

అవుకు మండలంలో..



సాయిరిషిత



జి.యోగేంద్ర యాదవ్



పి.రాకేష్



పి.జీవన్

అవుకు : పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన పి. రాకేష్ 583 మార్కులు, పి.జీవన్ 580 మార్కులు సాధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల టాపర్లుగా నిలిచారు. అవుకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నాగవైష్ణవి 569, శ్రావణి 569 మార్కులు సాధించి స్కూల్ టాపర్లుగా నిలిచారు. మదర్‌మోడల్ స్కూల్ విద్యార్థులు ఎం. సాయిరిషిత 591 మార్కులు, జి.యోగేంద్ర యాదవ్ 591, మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండలంలో 12 ప్రభుత్వ, 2 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 568 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 413 మంది ఉత్తీర్ణత సాధించి 73శాతం ఉత్తీర్ణత చెందారు.

'పది' ఫలితాల్లో శ్రీ సుధ విజయభేరి

డోన్ టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదీ పరీక్ష ఫలితాల్లో శ్రీసుధ పాఠశాల విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని డైరెక్టర్లు సుదర్శన్, సుధాకర్ గుప్త, సూర్యనారాయణ, కరస్పాండెంట్ సాధనగిరి వేణుగోపాల్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి విజయదుర్గ 597/600 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిందన్నారు. 109 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా ఉత్తీర్ణత సాధించారని , 187 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 97 శాతం విజయం సాధించారని తెలిపారు. ఈ ఫలితాల్లో కే.రుషిక 594/600, బి.కార్తిక్ 590, ఈ.శ్రీవర్షిణి 590, ఎస్ఎండీ జహీర్ 590, జే.శ్రీహరిణి 589, ఏ.వర్షిణి 589, టీవీ శ్వేత 586, డి.శివ, ఎస్. గోపాలకృష్ణ 584, ఏ.సాత్విక్ 583, ఏ.లక్ష్మి హన్సిక 583, ఎస్.రియాజ్ 581, ఎస్.షాబియా 581, జీవర్షిత 580, డి.ధీరజ్ 579, అవినాష్ 579, ఎస్. సౌమ్య579, చరణ్ తేజ 578, ధరణి 578లు అత్యధిక మార్కులు సాధించారని అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను యజమాన్యం అభినందించారు.



కే.విజయ దుర్గ



కే.రుషిక



ఈ.శ్రీవర్షిణి



బి.కార్తీక్



ఎస్ఎండీ జాహీర్

వెంకటనాయునిపల్లెలో వైద్య శిబిరం

డోన్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. కర్నూలు శ్రీచక్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పేదలకు పలు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణయ్య, శ్రీచక్ర హాస్పిటల్ వీఆర్వో మంజునాథగౌడు, తదతరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానం

డోన్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి మండలం కోయలకొండ గ్రామంలో వచ్చేనెల 2నుంచి నాలుగో తేదీ వరకు నిర్వహించనున్న గంగమ్మ దేవత విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని బుధవారం పలువురు ప్రముఖులను ఆహ్వాన కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఎంఎస్ఆర్ కార్యాలయంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్ రాజు, ఆర్మీ రామయ్య, ఉడుములపాడు నాగేంద్ర, చంద్రగౌడు పాల్గొన్నారు.

ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలి

ప్యాపిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటనకు కారణమైన పాక్ ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు రమణ బుధవారం ఓ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదులు హిందువులను గుర్తించి పాశవికంగా కాల్చి వేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇటువంటి ఉగ్రదాడులు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శిరివెళ్ల : బైసారన్‌లో ఉగ్రమూకలు జరిపిన దాడి పిరికిపంద చర్య అని బీజేపీ నాయకుడు మందుల రామకృష్ణ అన్నారు. శిరివెళ్లలో బుధవారం ఆయన మాట్లాడుతూ అమాయక ప్రజలను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలి

చాగలమర్రి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలని జిల్లా సర్వ సంకల్ప బ్రహ్మరహిత అచల పూర్ణానందరాజయోగి పీఠాధిపతి అన్నారు. బుధవారం గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండులో అచలపీఠ ఆశ్రమం నందు 14వ వార్షిక గురుపూజ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకముందు స్థానిక చెన్నకేశవ ఆలయం నుంచి పీఠాధిపతి దంపతుల శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో గురుపూజ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో బనగానపల్లె, గుడిపాడు, పెద్దయమ్మనూరు, రెవనూరు తదితర ప్రాంతాలకు చెందిన గురువులు, మహిళలు పాల్గొన్నారు.

కోతులు పట్టివేత

రుద్రవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో అనుమతులు లేకుండా వందకు పైగా కోతులను బుధవారం పట్టి బోన్లలో బంధించారు. కోతులను పట్టాలంటే పంచాయతీ అధికారులు లేదా ఫారెస్టు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతి లేకుండానే కోతులు పట్టడం గమనార్హం. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పాములేటి మాట్లాడుతూ కోతులను పట్టేందుకు అనుమతి తీసుకోలేదని అన్నారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి

డోన్ టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-3లో బుధవారం అర్ధరాత్రి సుదూర్ కుమార్ సాహూ అనే వ్యక్తి మృతిచెందాడని జీఆర్పీ ఎస్ఐ బిందుమాధవి బుధవారం తెలిపారు. డోన్ రైల్వేస్టేషన్ డిప్యూటీ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలకు జీఆర్పీఎస్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

రాయితీలను పునరుద్ధరించాలి: సీపీఐ

డోన్ టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు చేసిన వృద్ధులకు, జర్నలిస్టులకు ఇచ్చే రాయితీలను పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. బుధవారం డోన్ రైల్వే ఆర్ఎంకు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణ, మోటరాముడు, తదితరులున్నారు.

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ దాడులు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామ సమీపంలో అక్రమ మైనింగ్ క్వారీలపై మైనింగ్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ మైనింగ్ క్వారీలోని ఆరు కటింగ్ మిషన్ యంత్రాలు, ఒక టిప్పర్, ఒక పొక్లెన్‌ను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.